క్లుప్తంగా

నివాళి



రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ఇంతల కౌశమ్మ సోమవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కౌశమ్మ మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కుంటపల్లిలో..



సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జున్న రాజు యాదవ్ సోదరుడు జున్న శ్రీను ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందగా ఆయన మృతదేహానికి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని కట్టయ్యపల్లికి చెందిన ఆటో డ్రైవర్ దుడ్డె శోభన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు, గ్రామస్తులు సోమవారం రూ.55 వేల సాయం అందజేశారు. తొలుత శోభన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శోభన్ స్నేహితులు కంది మాధవరెడ్డి, గొడిశాల మల్లయ్య, నాంపెల్లి సంపత్, మంకు కరుణాకర్‌రెడ్డి, వలస శ్యామ్, చిట్టి రవి, ననుమాస రమేశ్ పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నేపల్లికి చెందిన గీత కార్మికుడు కత్తి విక్రమ్ ఇటీవల తాటిచెట్టు దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలవగా ఆయన్ను గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేశ్ మీడియాతో మాట్లాడారు. ప్రమాదాలకు గురైన వారిని, మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆర్నెళ్లుగా ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గీత కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపగాని వెంకటేశ్వర్లు, మర్ద సురేశ్, అశోక్, కిరణ్, కిరణ్ సాగర్, రమేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

దామెర: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న మిత్రులు 19 ఏళ్ల తర్వాత దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంటెయ్య, ఆగయ్య, రమేష్, ప్రసాద్, ఎల్లయ్య, పద్మజ, పరిపూర్ణచారి, కమలాకర్, వేణుగోపాల్, శ్రీనివాస్, జలందర్, తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌కు విశ్వకర్మ లెజెండరీ అవార్డు

హన్మకొండ కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీమంతుల దామోదర్‌కు విశ్వకర్మ లెజెండరీ అవార్డు ప్రదానం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో పలు వ్యాసాలు, రెండు గ్రంథాలు రాసినందుకు ఆయన అవార్డుకు ఎంపికయ్యారు.



వర్ధన్నపేట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



దుగ్గొండి : పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి



నల్లబెల్లి : ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రశాంతం

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నర్సంపేట, నెక్కొండ, ఖానాపురం, గీసుకొండ, దుగ్గొండి, రాయపర్తి, పర్వతగిరి, సంగెం, చెన్నారావుపేట, నల్లబెల్లి మండలాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే పట్టభద్రులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేశారు. పోలీసులు 144 సెక్షన్ విధించడంతోపాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు పోలింగ్ కేంద్రాలను రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, అధికారులు సందర్శించి పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట : పోలింగ్ కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట రూరల్ : బారులుదీరిన పట్టభద్రులు



నెక్కొండలో..



ఖానాపురంలో..



పర్వతగిరి : పోలింగ్ కేంద్రానికి వస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాయపర్తిలో..



పర్వతగిరిలో..



రాయపర్తిపోలింగ్ పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య



గీసుకొండ : ఓటు వేశాక మాజీ ఎమ్మెల్యే చల్లా



వర్ధన్నపేటలో..



సంగెంలో..



చెన్నారావుపేటలో..



నల్లబెల్లిలో..



దుగ్గొండిలో..

కబ్జా కోరల్లో ఊర చెరువు

సుమారు 15 గుంటల శిఖం భూమి ఆక్రమణ

- చర్యలు తీసుకోవడంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారుల నిర్లక్ష్యం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామ శివారులోని ఊర చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుందని తెలుస్తోంది. శిఖం భూమి ఆక్రమణకు గురవుతుండగా సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడంలో నీటిపారుల, రెవెన్యూ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

పాపయ్యపేట శివారు ఊరచెరువు శిఖం భూమిని ఎల్లాయగూడెం గ్రామ రహదారిలో యానాదులగూడెం సమీపంలో గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నట్టు కనపడుతోంది. ఆదివారం రాత్రి జేసీబీ సాయంతో చెరువులోని మట్టిని తవ్వి ట్రాక్టర్ల సాయంతో సుమారు 15 గుంటల భూమిని ఆక్రమించుకుని శిఖం భూమిని చదును చేశారు. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు, గ్రామస్తులు నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు, గ్రామస్తులు వాపోయారు. ఇకనైనా ప్రభుత్వంతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువు శిఖం భూమిని ఆక్రమణ నుంచి కాపాడి కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని హద్దులు ఏర్పాటు చేసి కాపాడాలని ఆయకట్టు రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.



ఊర చెరువులో చేపట్టిన తవ్వకాలు



ఆక్రమించిన శిఖం భూమిలో పోసిన మట్టి

ఉప్పలకుంటలో జోరుగా మట్టి దందా



మొరం తరలించిన ఉప్పలకుంట (బతుకమ్మ చెరువు)

- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురంలోని ఉప్పలకుంట (బతుకమ్మ చెరువు)లో మట్టి దందా జోరుగా సాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన రెవెన్యూ అధికారి విచ్చలవిడిగా జేసీబీలతో మట్టి, మొరం అక్రమ తవ్వకాలు చేపట్టి చట్ట వ్యతిరేకంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సంబంధిత శాఖల అనుమతి లేకుండానే చెరువులో ఇష్టారీతిన గుంతలు తీయడంతో వర్షాకాలంలో నీటితో నిండి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నట్టు గ్రామ యువకులు మీడియా ఎదుట సోమవారం వాపోయారు. అడ్డుకోవడానికి వెళ్లగా జేసీబీ, ట్రాక్టర్లు తీసుకోని పలాయనం చిత్తగించారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయాలని, మట్టి దందాకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కొండగట్టుకు భక్తుడి పాదయాత్ర

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన ఆంజనేయస్వామి భక్తుడు తీగల రాజు హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీక్షా విరమణ కోసం ఐనవోలు నుంచి కరీంనగర్ జిల్లా కొండగట్టు ఆంజనేయ క్షేత్రం వరకు పాదయాత్రతో వస్తానని మొక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో దీక్షా విరమణ కోసం సోమవారం మండల కేంద్రం నుంచి ఒక్కడే పాదయాత్ర ద్వారా బయలు దేరాడు.

ఘనంగా బ్రహ్మోత్సవ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు



విరాళాలు అందజేస్తున్న భక్తులు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండ్రోజులపాటు పూజలు జరగనున్న క్రమంలో తొలిరోజు కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. ఉదయం కలశపూజ, హోమ పూజ, ధ్వజ స్థంబానికి పూజ చేశారు. రాత్రి వేళలో లక్ష్మీ పూజ, కుంకుమ పూజ నిర్వహించగా మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి భాగస్వాములయ్యారు. బ్రహ్మోత్సవ వేడుకల నిర్వహణ కోసం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, పసునూటి వెంకటేశ్వర్లు, మల్యాల మధూకర్‌రావు, చెడిపాక ఉపేందర్, పిచ్చిరెడ్డి, ఎలంశెట్టి ప్రసాద్, పగడాల రాంనర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అపార నష్టం

నర్సంపేట : ప్లాస్టిక్ వినియోగంతో సమస్త జీవరాశులకు అపార నష్టం వాటిల్లుతుందని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గిరగాని సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ప్లాస్టిక్ హోల్‌సేల్ షాపుల వ్యాపారులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రదర్శించారు. అనంతరం సుదర్శన్ మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో జల, వాయు కాలుష్యం ఏర్పడి సముద్రంలోని, భూమిపై ఉండే జీవాలు నశించే ప్రమాదం ఉందన్నారు. 120 మైక్రన్ల క్యారీ బ్యాగులు, సంచుల అమ్మకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 జనవరి 1 నుంచి నిషేదించాయని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం వల్ల మనుషులకు క్యాన్సర్, గుండె జబ్బులు, చర్మవ్యాధులు, ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. భూమిపై పొరల్లో ప్లాస్టిక్ ఇరుక్కుని నీరు కాల్వలకు అడ్డొస్తూ వరదలకు దారి తీస్తుందని చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటి పోతాయని తెలిపారు. ప్లాస్టిక్ సంచులతోపాటు వినియోగించే పడేసే ప్లాస్టిక్ వస్తువులు గ్లాసులు, ఐస్‌క్రీమ్ కప్పులు, స్పూన్లు, ప్లేట్లు, తదితరాలను ప్రభుత్వాలు నిషేధించాయని వివరించారు. ప్లాస్టిక్ సంచులు, వస్తువులను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు బెజ్జంకి ప్రభాకర్, నాగెల్లి సారంగం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న సుదర్శన్, నాయకులు

రైతు కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

సంగెం : మండలంలోని కాట్రపల్లిలో మొక్కజొన్న పంట వ్యర్థాలను కాల్చివేస్తూ ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని ఊపిరాడక మృతి చెందిన రైతు గాయపు భగవాన్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం విపత్తు సహాయ నిధి నుంచి రూ.25 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని చందర్‌రావు ఆధ్వర్యంలోని పార్టీ బృందం సోమవారం పరామర్శించింది. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడారు. సన్నకారు రైతుగా కుటుంబాన్ని పోషించుకుంటున్న భగవాన్‌రెడ్డికి వృద్ధాప్యంలో ఉన్న తల్లి, భార్య, ముగ్గురు ఆడపిల్లలున్నారని చెప్పారు. ఇద్దరు కూతుర్లకు వివాహం చేసిన భగవాన్‌రెడ్డి చిన్న కూతురు వివాహం జరిపించక ముందే మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బీరం రాములు, కూస సంపత్‌కుమార్, బల్భుకూరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న చందర్‌రావు

కాంగ్రెస్ అభ్యర్థికి ఓటమి భయం

ఖానాపురం : ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటమి భయం పట్టుకుందని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌లను సందర్శించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి రాకేశ్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి భయంతోనే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. అహంకారం, బెదిరింపులకు తావులేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి పట్టభద్రులు ఓటుతో బుద్ధి చెప్పబోతున్నారని తెలిపారు. తనకు పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించారని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మస్తాన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

'కోడ్'లోనూ పర్మిట్ రూమ్‌లో సిట్టింగ్

రాయపర్తి (వర్ధన్నపేట): ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో 48 గంటలపాటు కోడ్ నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ పట్టణంలోని ఎస్‌బీఐ పక్కనే ఉన్న మద్యం (వైన్స్) షాపునకు అనుబంధంగా ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లో సోమవారం సిట్టింగ్ నడిచింది. మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో పర్మిట్ రూమ్ తెరిచి ఉండగా పలువురు మందు సేవించారు. పర్మిట్ రూమ్‌కు అనుమతి ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు సీల్ వేయలేదా? లేక సీల్‌ను నిర్వాహకులు తొలగించారా? అన్న చర్చ సాగుతోంది. అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తెరిచి ఉన్న పర్మిట్ రూమ్